# “ఏది వెలుతురు? ఏది చీకటి?”

తోట వెంకటాద్రి

ఆంధ్రులకు వార్తా పత్రికలు కొని చదివే అలవాటు లేదనే నడికొర్వజాలక, నెలకి రెండున్నర రూపాయలుబెట్టి ప్రతిరోజూ తెప్పిస్తున్న వార్తా పత్రికను తెరచి, మన ముఖ్యవార్తలైన 'యెక్కడ దొంగలు బడిందీ, యే వూళ్ళు తగలబడిందీ' యిత్యాదులతో పాటు, యింకా మా వూరి మీద మిలటరీ దండయాత్రచేసిందీ లేనిదీ గూడా చూచుకొని, 'ప్రథమం అవులింతంచ' అన్న ఆర్యోక్తి ప్రకారం, నిద్రాదేవి దివ్యసౌధానికి ప్రథమ సోపానాలనదగిన అవులింతలు రా మొదలిడడంతో, పత్రిక పక్కనపెట్టి, కండ్లు మూసుకొన యత్నించగానే, గంటసేపట్నుంచి వీనుల విందుగా వినొస్తున్న దోమల రాగాలాపన మధ్యమంలో పడడంవల్ల, మన్నిద్రకు కొంచెం అంతరాయం కలిగింది. కలిగి, పగలు ఈగల ఝుంకారావాలు, రాత్రులు దోమల సంగీతం, రాత్రింబగళ్లూకూడా యింట్లో మూషిక సంచారము, యేకత్ కారణాత్ మూర్జాల మృగయా వినోదం - మా యిల్లు వివిధ జంతుసందోహంతో ఒప్పారుతుండడం నిజంగా మా పురాకృత పుణ్యావిశేషమనీ, యివి కొరత పడిన యిండ్లకు వీటిని ఎగుమతి చేసి పుణ్యగతుల పోవచ్చనీ, యీ విషయం శ్రీమతితో - కార్యేషు మంత్రీ, అన్నారు గదండీ - ఆలోచించి మరీ చేద్దామని అనుకుంటున్న సమయంలో, యెప్పుడొచ్చి నా పక్కన ఉన్న పత్రిక తీసుకుందో శ్రీమతి మళ్లీ పత్రికను నా మొహం ముందుకు తెచ్చి, 'ఇక్కణ్ణించి యిక్కడిదాకా చదవండి' అంటూ వేలు పెట్టి చూపించింది.

'నేనిందాకనే పత్రికంతా క్షుణ్ణంగా చదివా; నువ్వు చదువుకొంస్తూ యిహా!' అన్నాను నేను.

'మళ్ళీ యిది చదవండొకసారి, అయ్యో!' అని శ్రీమతి అనగానే, ఆమె చూపించిన వ్యాస భాగన్ని యిట్లా చదివాను.

'రెండవ మహా సంగ్రామానంతరం, లక్షల సైన్యాలను, కోట్ల యుద్ధ పరికరాలను చేతులో మిగిల్చి పెట్టుకొని, మానవజాతి మానవత్వమునే అంత మొందింప నుంకించుచు, నీతి నియమముల హద్దులనే నిరసించి, లోక భయంకరముగ వర్తింప నుంకించుచుండిన అమానుష జాతులకు అంకుశమైన ఆటంబాంబు అమెరికా చేతిలో నుండి, చేతలచేగాక, చూపు బెదరింపులతో మానవ స్వాతంత్ర్యమును గాపాడుచున్నది. 'ఉష్ణం ఉష్ణేన శీతల'మని ఉష్ణమాలికా చికిత్సయే దేహమును సమ శీతలమునకు దేగలిగినట్లు, లోకమున ఆటంబాంబు బెదరింపులతో అమెరికా అహింసా సిద్ధాంతమును వ్యాపింపచేసి అహంభావమును అణంచగలదు.'

'దీనిమీదమీ అభిప్రాయం యేమిటి?' అంటూ ప్రశ్నించింది శ్రీమతి.

'నాకేమీ పాలు పోవడంలా. ఏం అభిప్రాయం కావాలి నీకు?' అని అడిగాను.

'నిజంగా అమెరికా ఆటంబాంబు చేతిలో బెట్టుకుని, మానవ స్వాతంత్ర్యాన్ని కాపాడుతుందా? అహింసా సిద్ధాంతాన్ని అమెరికా లోకాన వ్యాపింప జేస్తుందా?'

'కావచ్చు. యీ వ్యాసకర్త మహాయోగి. బహుశా సర్వం యోగదృష్టిం బరికించి, యిది రాసుండొచ్చు. యిందులో నాకేమీ అతిశయోక్తి కనబడ్డంలా!'

'సరే! ఆటంబాంబు ప్రేలుడు వల్ల సోకిన రోగాల్తో యింకా జపానులో అనేక వేలమంది బాధపడుతున్నారట. ఆటంబాంబునుఅట్టే పెట్టుకొని, మహావిధ్వంసకరమైన యితర ఆయుధాల్తో సర్వనాశనం చేయడంలేదా యిప్పు డమెరికా?'

'ఎప్పుడు, యెక్కడ?' అనిఅడిగాను శ్రీమతిని

'కొరియాలో. అనవసరంగా జోక్యం కలిగించుకొని, ఆ చిన్న దేశాన్నంతటినీ అమెరికా

మిత్రరాజ్యసమితి పేరిట, స్మశానం చేసేయడం లేదా?'

'ఈ సాధు సత్తము దన్నట్టు, కొన్ని అమానుష జాతులేవో అక్కడ ముందుగా దురాక్రమణ చేసుండొచ్చు. అందువలన అమెరికా, అది ప్రపంచశాంతికి భంగకరంగా పరిణమిస్తుం దేమోనని, సకాలంలో జోక్యం కలుగజేసుకుని, ఆ అమానుషజాతుల్ని 'ఉష్ణం ఉష్ణేన శీతలం' అన్నట్టు మాతమార్చుతూ ఉండొచ్చు. దీనికింత రాద్ధాంతం దేనికి?'

'మీరూ, మీ వ్యాఖ్యాకర్తా యిద్దరూ ప్రపంచ చరిత్రనే తారుమారు చేస్తున్నారు. ప్రవాహాని కెదు రీదుతున్నారు' అంటూ శ్రీమతి ప్రారంభించింది.

'ఉత్తర కొరియాను యెట్లాగైనా కబళిద్దామని, సింగ్మన్‌రీ ముఠా అమెరికా పాలక వర్గంతో యెంతో కాలంనుంచి కుట్ర చేస్తూందనీ, దానిప్రకారం దక్షిణ కొరియా సైన్యాలు 38వ అక్షాంశరేఖను దాటి, రమారమి వెయ్యిసార్లయినా ఉత్తర కొరియామీదికి దండెత్తాయనీ, ఆ దాడులన్నీ ఉత్తర కొరియన్లు తిప్పి కొట్టారనీ దక్షిణ కొరియా మంత్రి ఒకాయన ప్రపంచానికి ప్రకటించాడు. దీనివల్ల దురాక్రమణకు ఒడిగట్టింది యే అమానుషవర్గమో తేట తెల్లమవడంలేదా?

'ముందుకు ముందు తన సైన్యాల్ని ఉత్తర కొరియన్లమీదికి దూకించి, పన్నవలసిన కుయుక్తులన్నీ పన్ని, తరవాత తరవాత దురాక్రమణనీ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలనీ, అవనీ యివనీ మిత్రరాజ్యసమితిని తోలు బొమ్మ నాడించినట్టు ఆడించి, దాని ఆశీర్వాదం పొందిన అమెరికా వచ్చి దురాక్రమణదారు కాదా? ఆ అంతఃకలహంలో వేలుపెట్టమని అమెరికాను కొరియన్ ప్రజలు అర్థించారా? కొరియాను గృహశత్రువైన సింగ్మన్‌రీ ముఠాను రక్షించడానికి, సంరంభంగా బయలుదేరడానికి అమెరికాకు ఏం హక్కుంది?'

'అమెరికా సైన్యాలు కొరియా ప్రజల్ని గుంపులు గుంపులుగా చిత్రవధ చేస్తున్నారు. పిల్లలు, స్త్రీలు, వృద్ధులు అనే విచక్షణ లేకుండా నోరూ వాయిలేని సామాన్య ప్రజల్ని కాల్చి పారేస్తున్నారు. గ్రామాలకు గ్రామాలను ధ్వంసం చేసి, నేలమట్టం చేస్తున్నారు. పత్రికల్లో యింటి వల వచ్చిన బొమ్మలు చూడలా! కొరియా యుద్ధఖైదీలను దిగంబరుల్ని చేసి ఊరేగించడం, నర్సుల్ని వివస్త్రలుగా జేసి అవమానించడం, కొరియా వీరుల్ని శిలువ వేయడం— యివన్నీ అమెరికా అహింసా సిద్ధాంతప్రకారం చేసే సత్కృత్యాలేనా?'

'అమెరికా సైనికుల ఆటవికత్వం, పశుత్వం, కిరాతకత్వం, రాక్షసత్వం, పిశాచత్వం, క్రూరత్వం, ఘాతుకత్వం, చివరకు అటు నాజీలను, యిటు ఫాసిస్టు జపాన్ను గూడా మరపిస్తున్నాయని, అమెరికను పత్రికలే ప్రకటించడంలేదా! ఈ పనులన్నీ మిత్రరాజ్యసమితి పేరిట శాంతిని రక్షించేందుకేనా?' అని కొంచెం ఆపింది శ్రీమతి.

'ఇట్లాగా! తరవాత?' అన్నాను, యింకా విందామని.

'ఏ దేశంలోనైనా సరే, తమ స్వాతంత్ర్యం కోసం ప్రజలు పోరాటం సలుపుతూంటే, తన కేపో తేలు కుట్టినట్టులేచి, ఆయుధాల్ని డబ్బును సైనికుల్ని ఆ ప్రజాపోరాటాన్ని అణచడానికి పంపుతూ ఉండే అమెరికా;

'ప్రపంచ కల్లోలానికీ, అశాంతికీ దారిద్ర్యమే ప్రధాన కారణమని ఒకవైపున చెబుతూ, పంటపొలాలమీద 'కొలరేడో బీటిల్సు' అనే చీడపురుగుల్ని విమానాలద్వారా వెదజల్లుతూండే అమెరికా;

'బడుగు దేశాల్ని ఆదుకోవాలని ధర్మపన్నాలు పలుకుతూనే, తన మిగులు ధాన్యాన్నంతా సముద్రంలో పారబోయడమో, ఫ్యాక్టరీల్లో వంటచెరకుకింద తగులబెట్టడమో చేస్తూండే అమెరికా;

'అట్లాంటిక్ రాజ్యాల కూటము అనీ, పసిఫిక్ కూటము అని యింకా యిటువంటి కుత్సిత కూటాలనెన్నిటినో సృష్టిస్తూ, ప్రపంచాన్నంతా చీలదీస్తూండే అమెరికా;

'మార్షలు ప్రణాళికనీ, యూరపు ప్రణాళికనీ, సమీప, మధ్య, దూరప్రాచ్యాల ప్రణాళికలనీ, ఆగ్నేయాసియా ప్రణాళికనీ, యిట్లా ప్రాంతానికొక ప్రణాళిక, దేశానికో ప్రణాళిక

తయారుచేసి, ఆయా దేశాల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని హరించ జూస్తున్నదే అమెరికా;

'ప్రపంచాభివృద్ధి నిరోధక శక్తులన్నింటినీ తన వెనుక వేసుకుని, యెన్నో మాయోపాయాలు పన్నుతూ, మిత్రరాజ్య సమితిలో అమ్మిని బ్రహ్మిని, బ్రహ్మిని తిమ్మిని చేస్తూందే అమెరికా;

'అమెరికా చేసే ఈ కార్యకలాపం అంతా, ప్రజాస్వామ్యాన్ని, ప్రపంచశాంతిని కాపాడ్డానికేనా, లేక తన ఆటంబాంబులు చూపించి, ప్రపంచాన్నంతా తన చెప్పుచేతల్లో పెట్టుకోడానికా? అసలమెరికా ప్రపంచ శాంతిని కోరుతుందా, లేక యింకో ప్రపంచసంగ్రామాన్ని కోరుతుందా?'

'ఆలోచించాల్సిన విషయమే' అన్నా నేను.

'అన్నా బెల్ బ్యూకరు యేమంటుందో తెలుసా?' అన్నది శ్రీమతి పరాకించి, పైట సర్దుకుంటూ.

'ఎవరా అన్నా బెల్ బ్యూకరు?'

'లోగడ అమెరికన్ గూఢచారి దళంలోనూ, మాస్కోలోని అమెరికా రాయబార కార్యాలయంలోనూ, ఉద్యోగం చేసి, కారణాంతరాల వల్ల అవన్నీ మానుకుని, రష్యా పౌరసత్వాన్ని స్వీకరించి, అక్కడే స్థిరపడిపోయిన ఒక అమెరికను విదుషీమణి ఆమె.'

సరే! యేమంటుందో కానీ!' అన్నాను.

'అమెరికాలోని జీవితం తలుచుకుంటే యెంతో విచారంకేస్తుంది. అక్కడి వార్తా పత్రికలు, యింకో యుద్ధం, మళ్లీ రావాలనీ, కావాలనీ అనన్యప్రచారం చేస్తున్నై. గోబెల్సు అడుగుజాడల్లో నడుస్తూ, యుద్ధం మంచి దివ్యమైన లాభసాటి వ్యాపారమని, యుద్ధప్రచారకులు లజ్జాభిమానాలు లేకుండా యిచ్చే ఉపన్యాసాలు యింకా నాకు వినబడుతూనే ఉన్నై.

'ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం, యుద్ధ సామగ్రికోసం, అమెరికా మిలియన్లకొద్ది డాలర్లు ఖర్చుపెడుతూంది. యుద్ధవ్యయం అమెరికా బడ్జెటులో యెక్కువ భాగాన్ని భక్షిస్తుంది. ఇంకో యుద్ధంకోసం చేసే ప్రచారం మితిమీరి పోతుంది. అమెరికాలో యుద్ధప్రేరేపకులు శిక్షార్హులు కారుగదా, మీదుమిక్కిలి అన్ని విధాలా ప్రోత్సహింపబడుతున్నారు.

'అమెరికా ప్రభుత్వనాయకులూ, సైన్యాధిపతులూ ముందు హెచ్చరిక చేయకుండానే శత్రువుమీద ఆటంబాంబులు విడవాలని ఉబలాటపడుతున్నారు. వారి ఉపన్యాసాలు వింటూంటే, ఆర్థరు రేవుమీద పెర్ హార్బరు మీద జరిగిన విద్రోహకరమైన దాడులు, ఫాసిస్టు జపాను సాంప్రదాయం అనదుకంటె, అమెరికను సాంప్రదాయం అదమే ఉత్తమమని తోస్తుంది... అమెరికా సేనలిప్పుడు ప్రపంచంలోని అన్ని కీలకస్థానాల్లోనూ మకాం వేసుకుని ఉన్నై.

'మాస్కోలోని అమెరికా రాయబార కార్యాలయంలో పనిచేసే అట్లాంటి పెద్దమనుష్యులు చాలామంది. ప్రపంచంలో అమెరికా తప్ప, ఏ యితర రాజ్యమూ యింకో యుద్ధాన్ని కాంక్షించడం లేదని, రహస్యంగా ఒప్పుకున్న సందర్భాలు యెన్నో వున్నై.

'యీ విషయాలన్నీ నామట్టుకు నేను యేమనుకుంటున్నప్పటికీ నేటి అమెరికాకు అంతులేని యుద్ధోన్మాదం పట్టుకుందనడంలో అతిశయోక్తి అణుమాత్రం లేదు.' ఇదే ఆమె అన్నది. 'నిజమేనంటావా యిదంతా?' అని నేనడిగాను శ్రీమతిని.

'యిందులో అబద్ధం యేముంది? ప్రతివారికీ తెలిసిన పరమ సత్యం అనుకోండి. యిక వారి యొక్క ఒక రోజువారీ యుద్ధ కార్యక్రమం యెట్లా ఉందో వినండి. మధ్యధరా సముద్రంలో విమాన వాహన నౌకలమీద నున్న అమెరికను



విమానాలూ, సౌదీ అరేబియాలో అమెరికా కీలకస్థానమైన దహరన్‌లోని విమానాలూ లేచి ఉదయం యెనిమిదిన్నర గంటలకు దక్షిణ రష్యాలోని, నగరాలను ఫ్యాక్టరీలను ధ్వంసం చేసి రాగలవట. పదిన్నర గంటలకు బ్రిటనులోని అమెరికా విమానాలు మాస్కోనే పేల్చి వేయగలవట, అయితే దీనికోసం బ్రిటనులో కొద్దిగా అటంబాంబుల స్టాకు అట్టిపెట్టి వుంచడం అవసరమవుతుందిట. మధ్యాహ్నం రెండున్నర గంటలకు బ్రిటనులోని యితర అమెరికను విమానాలు రష్యాలోని పెద్ద ఆయుధ పరిశ్రమనే సర్వనాశనం చేసి రాగలవట. సాయంత్రం అయిదున్నరకు అలాస్కానుంచి, బ్రిటనునుంచిగాని బయలుదేరిన అమెరికా విమానాలు చాలా దూరాన్నున్న పెద్ద రష్యా పారిశ్రామిక కేంద్రం మీద బాంబులువేసి రాగలవట. అంటే రష్యా యెదురు ముట్టడికి తయారయ్యే మూడు నాలుగు గంటల్లోనే, పెద్దపెద్ద రష్యా పారిశ్రామిక కేంద్రాలన్నింటినీ, తుత్తునియలు చేసి వేయొచ్చట.'

'ఆ! అయితే రష్యా అంతా ఒక్క రోజుకే సరిపోతే, మిగతా ప్రపంచం యావత్తూ ఒక్క పూటకూడా పట్టదేమో!' అన్నాను.

'యింకా చూడండి గమ్మత్తు. కొరియామీద విజయంతోనే అమెరికా ప్లానులు ఆగిపోవట. ప్రపంచమంతా 'శాంతి, శాంతి' అని పరితపించిపోతున్నా అమెరికా యుద్ధ సన్నాహాలు సాగిపోతూనే ఉంటవట. దీనిమూలాన అమెరికా పెట్టుబడిదారులకు యుద్ధ కంట్రాక్టులు అమోఘంగా దొరుకుతవట. యిది మొన్ననే బైటపడిన రహస్య మండీ!'

'అరి దీని తాడు తెగ!' అన్నాను.

'యింకో ముఖ్య విషయం విన్నారూ! అమెరికా, తన సైనికులకు హిందుస్థానీ నేర్పడానికి పుస్తకం ప్రచురించిందట. అందులో మాటలెట్లా ఉంటాయో చూడండి యిహా; 'నేను అమెరికావాణ్ని', 'యిది అమెరికా: డబ్బు', 'నీకు మంచి బహుమాన యిస్తాం, నా ఆజ్ఞ శిరసా వహించు, లేకపోతే కాల్చేస్తాం', యిలాంటి వాక్యాలు, అమెరికా సైనికులు కొరియాభాషలో కూడా ఆయుద్ధానికి ముందే నేర్చుకొని ఉన్నారట. అయితే అమెరికా సైనికులకు హిందుస్థానీ నేర్పే అవసరం యేమొచ్చింది? భారతీయ విజ్ఞానాన్ని వారు సులభంగా గ్రహించేదుకా, లేక మనతో కలిసిమెలిసి తిరిగేందుకా? అయినా అమెరికను సైనికుల్తో మనకు పనే ముంటుంది చెప్పండి!'

'ఇంకెందుకు? కొంపారింది శ్రీమతీ! రేపొక నాటికి మనదేశంమీద కూడా బడాలనేగా వీళ్ళ యెత్తులు!' అన్నాను.

'యిప్పుడు తెలిసిందా అమెరికాయొక్క అసలైన రంగు? దాని ప్రజాస్వామ్యం, దాని అహింసా తత్వం, దాని శాంతి ప్రియత్వం, మీ యోగి పుంగవుడన్నట్లు, అవన్నీ అమెరికన్ మోడల్ కావచ్చు.'

'అదంతా యెందుకుగాని మన జవహార్లాలు, ప్రపంచం యావత్తూ శాంతి సంస్థాపనకోసం తపించి పోతూందనీ, యుద్ధ సన్నాహాలకు పురికొల్పే శక్తులను ప్రతిఘటించి, ప్రపంచ శాంతిని రక్షించాలనీ పదేపదే చెబుతున్నాడు. ఆయన చెప్పినట్లు చేద్దాం శ్రీమతీ!' అన్నాను.

'తప్పకుండా!' అంటూ శ్రీమతి లేచి, వెళ్ళి పడుకొంది. అంతలో నేను చేతులు జోడించి—

'పొద్దున మూను, స్కన్నపయి యెంతయుం దట్టును, పైరు నేత్రమున్, సైడ్డున గ్రేటుబుల్లు, బహు చక్కని గాంజెను హొయిరు లోవలన్, రాడ్డును హోండునందు, తన ప్రక్కన మాంటెను డాటరుండ, ఐ షుడ్డు డివోటు దండములు, సోలున ప్రేయరు సేసి, మై డియర్ గాడ్డును గొల్తు నీ యమెరికా రణతంత్ర వినాశ సిద్ధికై' అంటూ, అమెరికా యుద్ధ భూతాల పీడకలలు రాకుండా ఒక్కసారి మనసా స్మరహారుణ్ని స్మరించుకొని కళ్లు మూసుకున్నాను.

కొందరు పేరుపడ్డ "గొప్పవాళ్ళ" గొప్పతనం కేవలం స్థానికమైనది. చుట్టుపక్కల ఉన్నవాళ్లు మరీ బొత్తిగా అంగుష్ఠమాత్రులవడంచేత వాళ్లు గొప్పవాళ్లుగా చలామణీ అవుతారు—జాన్సన్.